క్లుప్తంగా

సెప్టెంబర్ 1 నుంచి సభ్యత్వ నమోదు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చీమకుర్తి: బీజేపీ జాతీయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ చీమకుర్తి మండల నాయకులు బొడ్డు శంకర్, గుండా శ్రీనివాసరావు, పాత్రుని నాగార్జున తెలిపారు. దానికి సంబంధించి బుధవారం చీమకుర్తిలో వర్క్‌షాప్ నిర్వహించారు. చీమకుర్తి పట్టణ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 4వ తేదీ నుంచి జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

విద్యుత్ భారం తగ్గించాలి



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: ప్రజలపై ప్రభుత్వం విధించిన విద్యుత్ భారం తగ్గించాలని, కార్పొరేట్ల దోపిడీని అరికట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఆపాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. తొలుత 25 సంవత్సరాల క్రితం విద్యుత్ చార్జీల పెంపు ఉద్యమంలో మరణించిన అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తొట్టెంపూడి రామారావు, పీ ఆంజనేయులు, కొల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు హౌస్ సర్వేలు పూర్తి చేయాలి

మద్దిపాడు: బీఎల్‌ఓలు హౌస్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ షేక్ మహమ్మద్ రఫీ సూచించారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒక ఇంటిలోని ఓట్లు ఒకే బూత్‌లో ఉండాలని, ఓటరు ఎవరైనా మరణిస్తే వారి ఓటు తొలగించడం, కుటుంబంలోని ఆడపిల్లలు పెండ్లి చేసుకుని వెళ్లిపోతే వారిని గుర్తించి ఓటు బదిలీ చేయడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారిని గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించేందుకు సహకరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ మరియదాసు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



చట్టాలు కఠినంగా ఉండాలి

వైద్యులపై దాడులు చేస్తే కఠిన చర్యలు అమలు చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలి. నాడి పట్టే డాక్టర్ భయంతో వైద్యం చేయలేడు. ఇటీవల కాలంలో డాక్టర్లపై దాడులు చేయడం ఆందోళన కలిగించే విషయం. ప్రతి వైద్యశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి భద్రత కల్పించాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని వదిలి పెడితే సమాజానికి చేటు. అలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలి.

– డాక్టర్ కె.వంశీకృష్ణ, ఈఎన్‌టీ స్పెషలిస్టు, మార్కాపురం జీజీహెచ్



ఆరోగ్య కేంద్రంలో భద్రత పెంచాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు భద్రత పెంచాలి. కోల్‌కత్తా సంఘటనతో దేశంలో మహిళలకు రక్షణ కరువైందని అర్థమైంది. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి రోజులు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దోషులను కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.

ఎం.సునీత, వైద్యాధికారి, దొనకొండ



ముస్తాబుకావయ్యా.. బొజ్జ గణపయ్య..!



వినాయకచవితి దగ్గరకొచ్చేసింది. పండుగ తేదీకి పట్టుమని పది రోజులు కూడా వ్యవధి లేదు. దీంతో బొజ్జ గణపయ్య సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాడు. వాడవాడలా కొలువుదీరి పూజలందుకునేందుకు హడావిడిగా సిద్ధమవుతున్నాడు. ఒంగోలు నగరంలోని మంగమ్మకాలేజీ బైపాస్ వద్ద, మినీస్టేడియం, మంగమూరురోడ్డు జంక్షన్, పేర్నమిట్ట రోడ్డు తదితర ప్రాంతాల్లో విగ్రహాల తయారీదారుల చేతుల మీదుగా తుది మెరుగులు దిద్దుకుంటున్నాడు. ఒక అడుగు నుంచి ఏడెనిమిది అడుగుల ఎత్తున్న గణపతి విగ్రహాలు అమ్మకాలకు కొలువుదీరాయి. రూ.4 వేల నుంచి రూ.50 వేల వరకు ధరల్లో అందుబాటులో ఉన్నాయి. కొన్నేళ్లుగా రాజస్థానీయులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్థిరపడి వినాయకుని విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తూ జీవిస్తున్నారు. జీవకళ ఉట్టిపడేలా రంగురంగుల బొజ్జ గణపయ్యలను సిద్ధం చేసి భక్తులకు అందజేస్తున్నారు.

– సాక్షి, ఒంగోలు













ఒంగోలును పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

- నగరపాలక సంస్థ నూతన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన నగర పాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్.. బుధవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో పారిశుధ్య పనులను కార్మికులతో సక్రమంగా చేయించాలని ఆదేశించారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5.30 గంటలకు, మధ్యాహ్నం మస్టర్ తప్పనిసరిగా వేయాలని, ఆ మస్టర్‌ను వాట్సాప్ గ్రూపులో షేర్ చేయాలని సూచించారు. వార్డు సచివాలయాల పరిధిలో ప్రతిరోజూ రోడ్లు శుభ్రపరచడం, కాలువల్లో పూడిక తీయటం, స్ప్రేయింగ్, ఫాగింగ్, బ్రషింగ్, యాంటీ లార్వాల్ ఆపరేషన్స్, బ్లీచింగ్ తదితర కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. పనిసమయంలో ఎవరైనా కార్మికులు పనిచేయకుండా కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పనిచేసే సమయంలో కార్మికులు ఆప్రాన్ ధరించాలని, ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు ఊడ్చటం లాంటి పనులను ఉదయం 7 గంటల్లోపు ముగించి అనంతరం ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులను ముందు, తర్వాత ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూపులో షేర్ చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.



మాట్లాడుతున్న నూతన కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన అధికారులు

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సిద్ధయ్య
- విద్యుత్ ఉద్యమంలో అమరులైన బషీర్‌బాగ్ మృతులకు నివాళులు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు సెంట్రల్: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలే అమరవీరులకు ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై సిద్ధయ్య అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం బుధవారం సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో జరిగిన పోరాటంలో ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యమకారులపై పాశవిక కాల్పులు చేసి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలను బలిగొందన్నారు. ఆ ఉద్యమం అనంతరం కొన్నేళ్ల పాటు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల జోలికి వెళ్లలేదని చెప్పారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల వేగం తగ్గిందన్నారు. ఈ 24 ఏళ్ల కాలంలో కేంద్రం, రాష్ట్రంలోని పలు పార్టీలు చాపకింద నీరులా విద్యుత్ రంగంలో ప్రమాదకర విధానాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సంస్కరణతో ప్రజలకు చౌకైన, నాణ్యమైన నిరంతరాయమైన విద్యుత్ అందుతుందని పాలకులు నమ్మబలికారని విమర్శించారు. కానీ విద్యుత్ భారాలు మరింత పెరిగాయని, ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ముందుగా అమరవీరుల చిత్రపటాలకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు విద్యుత్ చార్జీలతో ప్రజల మోస్తున్న భారాల గురించి వివరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావు, కంకణాల రమాదేవి, వి.బాలకోటయ్య, నగర కమిటీ సభ్యుడు తంబి శ్రీనివాసులు, హుస్సేన్, మహేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు శ్రీగిరిలో సామూహిక సువాసినీ పూజ

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం పది గంటలకు సామూహిక సువాసినీ పూజ (వరలక్ష్మీవ్రతం) నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు తెలిపారు. సామూహిక సువాసినీ పూజలో పాల్గొనదలచిన మహిళలు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పూజలో పాల్గొని వరలక్ష్మీ మాత అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

దేవిడ్‌రాజు చిత్రపటానికి రిటైర్డ్ కలెక్టర్ నివాళులు



నివాళులర్పిస్తున్న దాసరి, రిటైర్డ్ ఉద్యోగులు

ఒంగోలు సెంట్రల్: మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ పాలపర్తి డేవిడ్‌రాజు చిత్రపటానికి బుధవారం రిటైర్డ్ కలెక్టర్ దాసరి శ్రీనివాసులు నివాళులర్పించారు. స్థానిక క్లౌపేటలోని నివాసంలో డేవిడ్‌రాజు చిత్రపటానికి పూలమాలలు వేశారు. తాను కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో జెడ్పీ చైర్మన్‌గా ఉన్న డేవిడ్‌రాజుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర నాయకుడు పాలడుగు విజయేంద్ర, రిటైర్డ్ డీఈఓ మధుసూదనరావు, రిటైర్డు కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ బి.కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చలో ఒంగోలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

చీమకుర్తి: వచ్చేనెల 22వ తేదీ నిర్వహించే హలో మాల.. చలో ఒంగోలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా వెంగళరావు బుధవారం చీమకుర్తి అంబేడ్కర్ నగర్‌లో స్థానిక మాల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒంగోలులో నిర్వహించే కార్యక్రమానికి చీమకుర్తి మండలం నుంచి ఎక్కువ మంది తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ మండల, నియోజకవర్గ నాయకులు బండ్ల డేవిడ్, చావబత్తిన బ్రహ్మయ్య, వేమా బాలకోటేశ్వరరావు, మట్టిగుంట రామాంజులు, పిల్లి కోటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ ఆర్థిక సాయం

చీమకుర్తి: విద్యార్థుల యూనిఫాం కుట్టు కూలి కోసం డిప్యూటీ డీఈఓ రోజ్‌మేరీ రూ.16 వేల ఆర్థిక సాయం అందించారు. బుధవారం సంతనూతలపాడు మండలం మిట్టమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు యూనిఫాం కుట్టించుకోవడానికి ఒక్కొక్కరికి రూ.800 చొప్పున 20 మందికి రూ.16 వేలు అందించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరైతే ప్రతి ఏడాది యూనిఫాం కుట్టుకూలికి డబ్బులు తానే స్వయంగా అందిస్తానని తెలిపారు. దాంతో పాటు రానున్న క్రిస్మస్ పండుగకు కూడా విద్యార్థులకు నూతన వస్త్రాలు అందిస్తానని చెప్పారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ వెంకారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణయ్య నగరోత్సవం



శ్రీకృష్ణుడికి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: కృష్ణాష్టమి పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఒంగోలులో బుధవారం మధ్యాహ్నం శ్రీకృష్ణ భగవాన్ ఉత్సవ మూర్తితో నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి లేఅవుట్, ఎన్టీఆర్ పార్క్ వేదిక వద్ద కొలువుదీరి సోమవారం శ్రీ కృష్ణాష్టమి పండుగ నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నిత్య పూజలు, స్థానిక భక్తులచే భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహిస్తూ చివరిరోజు శ్రీకృష్ణ ఉత్సవ మూర్తిని ఒంగోలు పురవీధుల్లో మంగళ వాయిద్యాలతో కృష్ణం వందే జగద్గురుమ్ నామస్మరణతో నగరోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెవెన్యూ కాలనీ, సుజాతనగర్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ భగవానుడిని దర్శనం చేసుకుని స్వామివారి ఆశీసులు అందుకున్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఒంగోలు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు ఎం.సుబ్బారావు, సురేష్, శ్రీనివాసరెడ్డి, మాధవీలత, కృష్ణ, రవీంద్ర, ప్రసన్న, విశ్వనాథ్, స్రవంతి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ అవతార విశేషాలను వివరించిన అగస్త్యరాజుశివ...

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఒంగోలు మంగమూరు డొంక, ఐశ్వర్యనగర్లో భగవాన్ మురళీకృష్ణ మందిరంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజుశివ శ్రీ కృష్ణజన్మ విశిష్టత అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం అందించారు. శ్రీకృష్ణావతార పరమార్థం, శ్రీకృష్ణలీలల్లోని ఆధ్యాత్మిక, సాంఘిక ప్రయోజనాలు, శ్రీకృష్ణుని భక్తితో సేవించే భక్తులకు లౌకిక ప్రయోజనాలు, కష్ట సమయాలలో ఏ విధంగా భగవంతుడు మనల్ని రక్షిస్తాడనే విషయాలపై కవి బమ్మెరపోతన విరచిత ఆంధ్ర మహాభాగవతంలో దశమస్కంధంలోని పద్య ఆలాపన, వాటి బావార్థాలను భక్తులకు చక్కగా అర్థమయ్యేలా వివరించారు. అనంతరం అగస్త్యరాజుశివను మందిర కమిటీ సభ్యులు సత్కరించారు.



పేకాట ఆడుతూ పట్టుబడిన వారితో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

మద్దిపాడు (నాగులుప్పలపాడు): నాగులుప్పలపాడు ఎస్సైగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తానని ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్...

ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే నాగులుప్పలపాడు మండలంలోని మాచవరం గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్కడ పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,820 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.